మక్తల్‌లో కోర్టు ఏర్పాటుకు సీఎంను కలిసిన ఎమ్మెల్యే

మక్తల్ టౌన్, మే 27: మక్తల్‌లో కోర్టు ఏర్పాటు విషయమై మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సోమవా రం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని క లిశారని మక్తల్ న్యాయవాదులు దత్తాత్రే య తెలిపారు. ఇక్కడ కోర్టు లేకపోవడం వల్ల మక్తల్‌తో పాటు కృష్ణ, మాగనూరు ప్రాంతాల నుంచి నారాయణపేట, కొడంగల్ కోర్టులకు వ్యయప్రయాసలకోర్చి వెళ్లా ల్సి వస్తుందని తెలిపారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అలాగే ఈ ప్రాంత పలు సమస్యల ను విన్నవించామని తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి కుమార్ యాదవ్, కావలి శ్రీహరి తదితరులు ఉన్నారు.

'ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి'

ప్రజా సమస్యలను వింటున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 27: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫిర్యాదుదారులు హాజరై సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ప్రజల నుంచి మొత్తం 15 దరఖాస్తులు అందాయని తెలిపారు.

గ్రూప్స్ అభ్యర్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్

అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్

నారాయణపేట టౌన్, మే 27: గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. సోమవారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ 2024 ద్వారా గ్రూప్స్‌కు శిక్షణ తీసుకోనున్న అభ్యర్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కన్యాకుమారి, అభ్యర్థులు పాల్గొన్నారు.

మహిళలకు భద్రత కల్పించాలి

నవాబ్‌పేట, మే 27 : మండలంలోని మహిళలకు, మహిళా ఉద్యోగులకు వరుస దారి దోపిడీలపై భద్రత కల్పించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సోమవారం ఎస్సై అభిషేక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'ఆటోవాలా దారి దోపిడీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వారు స్పందించి ఎస్సై కలిశారు. మండలంలో వైద్య ఆరోగ్యశాఖలో చాలా మంది మహిళా ఉద్యోగులు పని చేస్తున్నారని, వారంతా ఎక్కువగా జిల్లా కేంద్రం నుంచి విధులకు వచ్చి పోతుంటారని వివరించారు. మండలంలో గత వారంలో ఆటో డ్రైవర్ వరుస దొంగతనాలకు పాల్పడిన విషయాన్ని ఎస్సై దృష్టికి తీసుకెళ్లి మహిళలకు ప్రత్యేక భద్రత కల్పించాలని కోరారు. అలాగే నవాబ్‌పేట ప్రభుత్వ దవాఖాన పరిసరాల్లో పోలీసుల గస్తీ పెంచాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై అభిషేక్‌రెడ్డి స్పందిస్తూ మహిళలు ఒంటరిగా, అనుమానాస్పదంగా ఉన్న ఆటోలను ఎక్కవద్దని, బంగారం అధికంగా ధరించి బయటి ప్రయాణాలు చేయొద్దని కోరారు. ఎస్సైని కలిసిన వారిలో వైద్య సిబ్బంది రాములు, శ్రీనివాస్, శరభలింగం, అవినాశ్ ఉన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నారాయణపేటరూరల్, మే 27 : అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నారాయణపేట మండలంలోని భీమండికాలనీలో పని చేస్తున్న ఇద్దరు మహిళా ఉపాధ్యాయులను కలెక్టర్ అనుమతితో సస్పెండ్ చేసినట్లు పేట డీఈవో అబ్దుల్‌ఘని తెలిపారు. ఇప్పటివరకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేయకపోవడంతో పాటు బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేయకపోవడం, స్కూల్ గ్రాంట్స్ విత్ డ్రా చేయకపోవడం, ఎంఈవో జారీ చేసిన మెమోకు జవాబు ఇవ్వవకపోవడం వల్ల ఫర్‌హీన్‌భాను(ఎస్‌జీటీ), జ్యోతి (ఎస్‌జీటీ)ని సస్పెండ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

ఇద్దరు మహి ళా ఉపాధ్యాయులు పాఠశాలలో హెచ్.ఎం పోస్టును ఎవ్వరూ తీసుకోకపోవడంతో వారి వేతనాలను రెండు నెలలు నిలిపివేసి నా మార్పు రాలేదని పేర్కొన్నారు. విద్యార్థుల గత విద్యాసంవత్సరం ప్రగతిపత్రాలు నేటికీ అందజేయలేదని సమాచారం.

పీహెచ్‌సీలో ఒకే రోజు మూడు కాన్పులు

భూత్పూర్‌లో బాలింతతో డాక్టర్ అబ్దుల్ రబ్బు

భూత్పూర్, మే 27: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో సోమవారం మూడు కాన్పులు చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్దుల్ రబ్బు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేహబేగం(భూత్పూ ర్), సంగీత (భూత్పూర్), అనూష(అమిస్తాపూర్)కు సాధారణ కాన్పులు అయ్యాయని తెలిపారు. కాన్పులు చేసిన స్టాఫ్‌నర్స్ స్వాతిని డాక్టర్ రబ్బు, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, సూపర్‌వైజర్ యాదమ్మ అభినందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒ కే రోజు మూడు కాన్పులు జరగడం రికార్డు అని పేర్కొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట టౌన్, మే 27: క్రీడాకారులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సెక్టోరియల్ అధికారి నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవిశిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి, క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. శిక్షణలో మెళకువలను నేర్చుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలన్నారు.

కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

నారాయణపేట టౌన్, మే 27: పట్టణంలోని బాలకేంద్రంలో వివిధ కళల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులకు సోమవారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్ ఆత్మారంఎడ్కే, శకుంతల దంపతులు పరీక్ష ప్యాడ్‌లు, స్నాక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి సిబ్బంది నర్సింహులు, వసం త్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ అర్జెంట్‌గా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & ITI మెకానిక్స్ కావలెను. మంచి జీతం, వసతి సౌకర్యం కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-339514-AII

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కౌంటింగ్ విధులు జాగ్రత్తగా నిర్వహించాలి

- ఎన్నికల సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రోఅబ్జర్వర్లకు శిక్షణ
- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 27: మహబూబ్‌నగర్ లోకసభ ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎన్నికల సూపర్‌వైజర్, అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రంలో అనధికార వ్యక్తులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల అధికారులు సూచించిన ఐడీ కార్డులు ధరించిన వారిని మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతించాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు మాట్లాడుతూ కౌంటింగ్ పద్ధతులను పాటించాలని చెప్పారు. ఒక్క కౌంటింగ్ హాల్‌లో 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, సహాయకులు ఉంటారని తెలిపారు. సిబ్బంది కౌంటింగ్ విధులపై సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నోడల్ అధికారి శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ ఈ శిక్షణలో 83 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, 98 మంది సహ అధికారులు, 12 మంది ట్యాబ్యులేషన్ సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నెలాఖరులోగా కొనుగోలు చేయాలి

యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మిగిలిపోయిన ధాన్యంను వేగం కొనుగోళ్లు పెంచాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ వెబెక్స్ సమావేశం ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ, పారిశుధ్యంపై సమీక్షించారు. మిగిలిన వరి ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం జూన్ 6వ తేదీలోగా పంపిణీ చేయాలని, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో చేపట్టిన పనులను పూర్తి చేయాలని, సివిల్ సప్లయ్ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. వర్షాకాలం ఇబ్బందులపై ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని, అధికారులు, వైద్యారోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు 40శాతానికి పెంచాలి

ధన్వాడ, మే 27: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24శాతం నుంచి 40 శాతానికి పెంచాలని జిల్లా జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షుడు నిరుటి నరసింహానాయుడు, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సంద బాల నరసింహులు సోమవారం ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపడతామని, రిజర్వేషన్లు మొత్తాన్ని బీసీలకు స్థానిక సంస్థల్లో 40 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక సంస్థలలో బీసీల ప్రాతినిధ్యం పెరగాలంటే బీసీ రిజర్వేషన్లు పెంచాలన్నారు.

జోరుగా ఇసుక దందా

మిడ్జిల్, మే 27 : మండలంలోని అయ్యవారిపల్లిలో ఇసుక డంపుల నుంచి రాత్రి సమయంలో టిపర్లుతో జోరుగా ఇసుక దందా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా రాత్రి సమయంలో హిటాచీ సాయంతో జోరుగా ఇసుక అక్రమ దందా జరుగుతుండగా గ్రామస్తుల సమాచారంతో మిడ్జిల్ పోలీసులు తనిఖీ చేయగా ఇసుక డంపు వద్ద ఉన్న హిటాచీని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆనంద్ తెలిపారు.

నెట్‌బాల్ జట్ల ఎంపిక

ధన్వాడ, మే 27: ఈనెల 31 నుంచి జూన్ 1వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే నారాయణపేట జిల్లా జట్ల ఎంపికను స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ బాలుర క్రీడామైదానంలో నిర్వహించినట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం ప్రతినిధులు డాక్టర్ రామ్మోహన్ గౌడ్, అంజత్ తెలిపారు. ఈ ఎంపికలకు 50మంది పురుషులు, 20 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా క్రీడల, యువజన అధికారి శెట్టి వెంకటేశ్, కుంగ్ ఫూ మాస్టర్ గౌని శ్రీనివాస్ పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సుదర్శన్ గౌడ్, ఆనంద్‌గౌడ్, పీఈటీలు తిరుమలేశ్, బాలరాజు, రవికుమార్ పాల్గొన్నారు.

పాఠశాలలకు నిధులు మంజూరు

ధన్వాడ, మే 27: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న 37 ప్రాథమిక మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.88.30లక్షలు మంజూరు చేసిందని ధన్వాడ ఎంపీడీవో సాయిప్రకాశ్ తెలిపారు. పనులు దక్కించుకున్న కమిటీలు నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు.

క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- ఎస్పీ యోగేశ్ గౌతమ్

చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

నారాయణపేట, మే 27 : నూతన క్రిమినల్ చట్టాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర చట్టాలు-2023 అమల్లోకి తీసుకురానున్న నేపథ్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, కేసు నమోదు విధానం, చార్జిషీట్ తయారు చేసే విధానం, శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సిన తీరు తదితర అంశాలను కొత్త చట్టాలలో మార్పులు చేశారని తెలిపారు. ప్రస్తుతం అమల్లోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్యం అధినియం చట్టాలు శాంతిభద్రతల పరిరక్షణలో మైలురాయిగా నిలుస్తాయన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించేందుకు అవకాశం దొరుకుతుందన్నారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతన చట్టాలపై శిక్షణ పొందిన అధికారులతో బ్యాచ్‌ల వారీగా నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు లింగయ్య, మహేశ్, సీఐలు శివశంకర్, రాజేందర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాసులు, భాగ్యలక్ష్మీరెడ్డి, మురళి, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 8 ఫిర్యాదులు..

పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎనిమిది ఫిర్యాదులు అందాయి. బాధితులతో నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ చట్టప్రకారం ఫిర్యాదులను పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని సీఐలు, ఎస్సైలకు ఫోన్‌లో ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలమూరు, మే 27: మహబూబ్‌నగర్ పట్టణంలోని 33కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా న్యూటౌన్, శెట్టికాంప్లెక్స్, పాతడీఈవో ఆఫీస్, బోయపల్లిగేట్, పోలీస్‌లైన్, నోబుల్ హాస్పిటల్, రవి పిల్లల హాస్పిటల్, తెలంగాణ చౌరస్తా, కొత్తబస్టాండ్, కలెక్టర్ బంగ్లా చౌరస్తా, ఓపెన్వెల్ ఏరియాలలో మంగళవారం ఉదయం 7:30 నుంచి 8గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు టౌన్2 ఏఏఈ ఆదిత్య, టౌన్3 ఏఏఈ భగవంతయ్య తెలిపారు. అలాగే 11కేవీ స్టేడియం ఫీడర్ నిర్వహణ కారణంగా స్టేడియం గ్రౌండ్, క్రౌన్‌గార్డెన్, రవిపిల్లల హాస్పిటల్, ఎస్‌ఎస్‌గుట్ట, న్యూటౌన్, మలబార్ గోల్డ్ వెనుక ఏరియాలో ఉదయం 7 నుంచి 10గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కృష్ణ మండలంలో..

కృష్ణ, మే 27: మండలంలోని కృష్ణ మండల కేంద్రంతో పాటు హిందుపూర్, కున్సి, చేగుంట, తంగిడిగి, కుసుమూర్తి, సుకురు లింగంపల్లి, గురుజల్, ఐనాపురం గ్రామాల్లో మంగళవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ అధికారి ధర్మతేజ తెలిపారు.

విద్యుత్ లైన్ల కింద పెరిగిన చెట్లు కొట్టివేత పనులు చేపడుతున్నామని తెలిపారు.

గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ

పనులను పరిశీలిస్తున్న ఏడీఈ తౌర్యానాయక్

నవాబ్‌పేట, మే 27 : మండలంలోని ఇప్పటూర్, చౌటపల్లి, గోవోనిపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌కో ఏడీఈ తౌర్యానాయక్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత ఆదివారం ఆయా గ్రామాల్లో వానగాలి బీభత్సానికి కరెంటు స్తంభాలు విరిగి పడి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు విరిగిపడగా, పలు డబ్బాల షాపులు, పెంకుటిళ్లు సైతం గాలిబీభత్సానికి రేకుల ఎగిరిపోయి పలువురు నిరాశ్రయులుగా మారారు. విషయం తెలుసుకున్న ఏడీఈ తౌర్యానాయక్, విద్యుత్ అధికారులు గ్రామాల్లో పర్యటించి విరిగిపోయిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి లైన్లు పునరుద్ధరించి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ సంతోష్‌కుమార్, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువు దుకాణాల తనిఖీ

ఎరువుల దుకాణం రికార్డులను పరిశీలిస్తున్న జాన్ సుధాకర్

కృష్ణ, మే 27 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీ పరిధిలోని టైరోడ్ వద్ద గలఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులను పరిశీలించారు. అనుమతి ఉన్న కంపెనీల ద్వారా డీలర్లు విత్తనాలు కొనుగోలు చేయాలని, షాప్ బోర్డు, సీడ్స్ లైసెన్స్, ధరల పట్టిక కొనుగోలుదారులకు కనిపించేలా ఉండాలని సూచించారు. అలాగే నిషేధిత డీటీ- 3 విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, ఏఈవో అభిలాశ్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల తనిఖీ

మాగనూర్, మే 27 : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ బుక్కులను, బిల్లులను పరిశీలించారు. గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని చూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు డీలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఇసుక తరలింపేనా?

మాట్లాడుతున్న రాజుల ఆశిరెడ్డి

మక్తల్ టౌన్, మే 27: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి అంటే చెరువుల్లో ఒండ్రు, వాగులో ఇసుక తరలింపేనా అని బీఆర్ఎ స్ సీనియర్ నాయకు లు రాజుల ఆశిరెడ్డి అ న్నారు. సోమవారం ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మక్తల్ ని యోజకవర్గంలో ఏ గ్రామంలో చూసినా నీటి సమస్య ఉత్పన్నమవుతున్నప్పటికీ అధికారు లు, స్థానిక ఎమ్మెల్యే నీటి సమస్యను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యారని వి మర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ నిర్వహణలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందన్నారు. దీనివల్ల తాగునీరు లేక గ్రామీణ ప్రాంతాల మహిళలు బిందెలతో రోడ్లపైకి వస్తున్నారని, వారి బాధ వర్ణనాతీతంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 7 మెగావాట్ల విద్యుత్ నుంచి 24వేల మెగావాట్ల విద్యుత్ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చి పెడితే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొన్ని గ్రా మాల్లో విద్యుత్ సరఫరా లేక తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతోందన్నారు. అధికారులకు ఫోన్ లో తెలియజేసినా స్పందించక తీవ్ర ఇబ్బందు లు ఎదురవుతున్నాయని అన్నారు. స్థానిక ఎ మ్మెల్యే నీటి సమస్యపై అధికారులతో ఏనాడూ రివ్యూ మీటింగ్ నిర్వహించలేదన్నారు. ప్రజా సమస్యలను చోద్యం చూస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో తాగునీరు, కరెంటు సమస్య వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సమస్యలపై బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పనితీరును ఎండగడతామని పేర్కొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సాయం

బాలానగర్, మే 27 : బాలానగర్ మండలం ఈదమ్మగడ్డతండాలో వాలీబాల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ఎంపీటీసీ లింగ్యా నాయక్ రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం గ్రామంలో క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించిన ఆయన క్రీడాకారులకు నగదును అందజేశారు.

సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద, మే 27: మండలంలో రైతులకు వానకాలం పంట కోసం సబ్సిడీపై విత్తనాలు అందించాలని సీపీఐ నాయకులు తాయప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. వానకాలం సాగు ప్రారంభంలోనే విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో ప్ర భుత్వమే ఇవ్వాలని, భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంటలు సాగు చేయాలో రైతులకు అవగాహన కల్పించాలని అందులో కోరారు. కార్యక్రమంలో సీపీఐ మాస్‌లైన్ నాయకులు రైతులు కర్రెప్ప, నర్సప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఉచిత విద్య

మక్తల్ టౌన్ మే 27: తల్లిదండ్రులు లేని పిల్లలకు శ్రీ సిద్ధిలింగేశ్వర పశ్చిమాద్రి సంస్థాన విరక్తి మఠంలో ఉచిత విద్యను అందించడంతోపాటు ఉచిత వసతి అందిస్తున్నామని పక్షి మాదిరి విరక్తి మఠం పీఠాధిపతి లింగ మహాస్వామి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలోని మాగనూరు మండలం నేరడగంలోని మఠంలో నాలుగో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో ఉచిత విద్యను అందించడంతోపాటు వసతిని సైతం కల్పించనున్నామని తెలిపారు. నియోజకవర్గంలో తల్లిదండ్రులు లేని, పేదపిల్లలు ఎవరైనా ఉంటే 900049 8101, 9100256318 నెంబర్లను సంప్రదించాలని, లేదా సిద్ధిలింగ మహావిరక్తి మఠం వద్దకు రావొచ్చని తెలిపారు.

ప్రైవేట్ దవాఖాన సీజ్

మిడ్జిల్, మే 27 : మండల కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ దవాఖానను సీజ్ చేసినట్లు వైద్యాధికారి శివకాంత్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మిడ్జిల్‌లో ఆర్‌ఎంపీ వెంకటేశ్ నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రిని మండల వైద్యాధికారి శివకాంత్ తనిఖీ చేసి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దవాఖానను సీజ్ చేశారు. వైద్యాధికారి వెంట హెల్త్ అసిస్టెంట్ దేవయ్య, పోలీసు శ్రీనివాసులు ఉన్నారు.

చదువుతో పాటు కళలను అభ్యసించాలి

బహుమతులు అందుకున్న విద్యార్థులతో జిల్లా అధికారి శ్రీనివాసులు

పాలమూరు, మే 27: మహబూబ్‌నగర్ స్ఫూర్తి సామాజిక సేవ యువజన కళా సంస్థ ఆధ్వర్యంలో స్వరలహరి కల్చరల్ అకాడమీ కార్యాలయంలో విద్యార్థులకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు కళలను అభ్యసించడం ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం ఏర్పడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవి లక్ష్మణ్‌గౌడ్, స్వరలహరి కల్చరల్ అకాడమీ సభ్యులు డా.మేకల శ్రీనివాస్, డీ.కే.ఆంజనేయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నగదు తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి

కస్టమర్లకు సూచనలు చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

నారాయణపేట, మే 27: ప్రజలు బ్యాంకులలో నగదు డిపాజిట్, డ్రా చేసుకొని తీసుకెళ్లే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సీఐ శివశంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ లు చేపట్టారు. బ్యాంకు వద్ద మాటు వేసి దొంగతనాలు చేస్తున్న వారిని గుర్తించేందుకు తనిఖీలు చేపట్టారు. అనుమానం ఉన్న వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైస్‌తో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బ్యాంకుకు వచ్చే కస్టమర్లపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎవరిపై అ యి నా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాం కు లావాదేవీలకు వచ్చే కస్టమర్లు జాగ్రత్తగా ఉంటూ చుట్టుపక్కల గమనిస్తూ ఉండాలన్నారు.

మొక్కలు నాటుదాం

పాలమూరు, మే 27: మహబూబ్‌నగర్‌లోని అన్నపూర్ణ సమేత విశ్వనాథస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం ఆలయ ధర్మకర్త ప్రభాకర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలు చాలా ఉపయోగమని అందుకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలన్నారు. 40రకాల మొక్కలను 100కు పైగా నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ రామలింగం, వెంకటేశ్వర శర్మ, డా.హేమంత్‌కుమార్, మానస, సుచరిత, రాములు, యాదగిరి, ఆండాలు త్రివేణి, రాణి, అంజమ్మ పాల్గొన్నారు.

నేడు సురవరం గ్రంథావిష్కరణ

పాలమూరు, మే 27: తొలి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రసిద్ధ పరిశోధకులు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకొని బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహిస్తున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షుడు డా.భీంపల్లి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలోని రచయితలు, కవులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈదమ్మ ఆలయంలో పూజలు

ఆలయం వద్ద సామూహికంగా హోమం చేస్తున్న భక్తులు

మిడ్జిల్, మే 27 : మండల కేంద్రంలోని ఈదమ్మ ఆలయంలో సోమవా రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతల (బొడ్రాయి) ఉత్సావాల్లో భాగంగా మహిళలు పెద్ద ఎత్తున బొడ్రాయికి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద అమ్మవారికి అభిషేకం, పంచసూక్త సహిత దంపతులు సామూహిక హోమం వంటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శంకర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: మహిళ దుర్మరణం

అదుపు తప్పి బోల్తాపడిన ట్రాక్టర్

మహ్మదాబాద్, మే 27 : ట్రాక్టర్ బోల్తా పడి ఓ మహిళ దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మం డల పరిధిలోని మొకర్ల బా ద్, మంగంపేట్ గ్రామాల మధ్య చోటుచేసుకున్నది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్ర కారం హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన గుడే అంజిలమ్మ(60) సోమవారం ఉదయం మంగంపేట్‌లో తన కూతురు ఇంటికి వచ్చి తిరిగి మొకర్లబాద్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా ట్రాక్టర్ రావడంతో తన ఇద్దరు కూతుళ్లతో సహ ట్రాక్టర్ ఎక్కింది. దాదాపు 200 మీటర్ల దూరం వెళ్లగానే ట్రాక్టర్ అదుపు తప్పి అంజిలమ్మ పైనే పడడంతో కింద ఇరుక్కుపోయిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలు కావడంతో 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ట్రాక్టర్‌ను జేసీబీ సహాయంతో పైకి లేపి అంజిలమ్మ మృతదేహాన్ని బయటికు తీసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.